



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
16-12-2025
పేజీలు: 02




## నేషనల్ హెరాల్డ్ కేసు.. సోనియా, రాహుల్‌కి ఊరట

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీకి కీలక ఊరట లభించింది. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు సంబంధించిన ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో వారిద్దరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించి దాని ఆస్తుల్ని ఆధీనంలోకి తీసుకోగా.. రాహుల్, సోనియాకు మెజార్టీ వాటా ఉన్న యంగ్ ఇండియా రూ.50 లక్షలు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెల్లించి ఏజేఎల్‌ను సొంతం చేసుకొన్నట్లు ఈడీ చెబుతోంది.



## సిర్పూర్ అడవుల్లో బయటపడ్డ మావోయిస్టుల స్థావరం.. 16 మంది అరెస్ట్

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ) మండలంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడ్డారు. సోమవారం రాత్రి సిర్పూర్ అడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో వారికి తారస పడిన 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మావోయిస్టులు వారి స్థావరాలను మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ నిఘా విభాగం సమాచారం అందిచండంతో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, స్పెషల్ పార్టీ పోలీసులు సిర్పూర్ (యూ) అడవుల్లో కూంబింగ్ నిర్వహించగా.. మావోయిస్టు స్థావరం కనిపెట్టారు. దీంతో చాకచక్యంగా వ్యవహరించి మావోయిస్టులను పట్టుకున్నారు. మొత్తం 16 మంది మావోయిస్టులను పట్టుకున్నట్లు ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు, 7 పురుషులు ఉన్నట్లు తెలిసింది. ఇందులో జిల్లా కమాండెంట్ సభ్యుల స్థాయి కేడర్‌లో నలుగురు ఉన్నట్లు సమాచారం. పట్టుపడ్డ వారిని సోమవారం రాత్రే డీజీపీ కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది.





# సర్పంచులను వేధిస్తే ఊరుకోం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలన్నారు. ఆస్పత్రి పాలైన వారి కుటుంబాని ఆర్థిక సహాయం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తకలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు.

సూర్యాపేట, నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడి చేసి మూత్రం తాగించారన్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్యకర్త మల్లయ్య యాదవ్‌ను కాంగ్రెస్ గూండాలు హత్య చేశారు, ఇంకో బీసీ సోదరుడి భార్య నామినేషన్ వేస్తే, అతడిని కిడ్నాప్ చేసి కోమటిరెడ్డి అనుచరులు చిత్ర హింసలు పెట్టారన్నారు. ఇన్ని అరాచకాలు జరిగినా పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ గుర్తుపెట్టుకుంటున్నామని, పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే తామే డ్యూటీ చేస్తామన్నారు. దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తాము కూడా తిరగబడతామన్నారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్ర గాయాల పాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భారతి, బాలరాజ్ కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను పార్టీనే భరిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని.. దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామన్నారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. సీఎం తన భాషతో కార్యకర్తలను రెచ్చగొట్టడం మానుకోవాలని, జరగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.



## బీబీసీకి ట్రంప్ షాక్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ మధ్య వివాదం కొనసాగుతోంది. 2021 జనవరి 6వ తేదీన ఆయన చేసిన ప్రసంగాన్ని బీబీసీ ఛానల్ తప్పుడు అర్థం వచ్చేలా మార్చేసి ప్రసారం చేయడం వల్లే క్యాపిటల్ హిల్‌లో అల్లర్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీబీసీకి ట్రంప్ తాజాగా గట్టి షాకిచ్చారు. సంస్థపై పరువు నష్టం దావా వేశారు. 10 బిలియన్ డాలర్ల నష్టపరిహారం డిమాండ్ చేశారు. మియామిలోని ఫెడరల్ కోర్టులో ట్రంప్ దావా వేశారు. వివరాల్లోకి వెళితే, 2020లో జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత 2021 జనవరి 6న వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై ఆయన మద్దతుదారులు దాడి చేశారు. ఆ సందర్భంగా ట్రంప్ దాదాపు గంటసేపు ప్రసంగించారు. దీనిపై బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీలో తన ప్రసంగాన్ని వక్రీకరించారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఇక ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్‌కు బీబీసీ క్షమాపణలు కూడా చెప్పింది. బీసీసీ చైర్మెన్ సమీర్ షా .. వైట్‌హౌజ్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేసిన అంశంలో తనతో పాటు సంస్థ క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. తాము ప్రసారం చేసిన ఆ వివాదాస్పద డాక్యుమెంటరీని మళ్లీ ప్రసారం చేసే ప్రణాళిక లేదని బీసీసీ వెల్లడించింది. తాము ఎడిట్ చేసిన ట్రంప్ ప్రసంగం తప్పుదోవ పట్టించే రీతిలో ఉన్నట్లు అంగీకరిస్తున్నామని బీబీసీ చెప్పింది.




## కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి.అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..? ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆమె.. అందంలో అప్సరస.. కానీ తెలుగులో చేసిన సినిమాలు మాత్రం రెండు సినిమాలే ఒకటి డిజాస్టర్, మరో సినిమా భారీ హిట్. ఆమె ఎవరో కాదు దిశా పటాని. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

## ఏడేళ్ల చిన్నారిని బిల్డింగ్ పైనుండి పడేసి చంపిన కన్న తల్లి

మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. తన ఏడేళ్ల కూతురు షారోన్ మేరీని మూడవ అంతస్తు పైనుండి కిందకు పడేసింది కన్న తల్లి. తీవ్ర గాయాలపాలైన చిన్నారిని గాంధీ ఆసుపత్రికి తరలించగా.. కాసేపటికే ప్రాణాలు కోల్పోయింది. మల్కాజ్‌గిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తల్లిదండ్రులు 20 ఏండ్లుగా స్థానిక వసంత్‌పురి కాలనీలో ఉంటున్నారు. తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. పాప తల్లి చాలా రోజులుగా మానసిక సమస్యలతో బాద పడుతున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం తాము నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌పైకి బిడ్డను తీసుకెళ్లిన తల్లి బిల్డింగ్‌పైనుంచి కిందకు తోసేయగా పక్క బిల్డింగ్ మెట్లపై పడిన బాలిక తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన స్థానికులు పాపను వెంటనే గాంధీ అసుపత్రికి తరలించారు. గాయపడిన చిన్నారికి వైద్యులు చికిత్స చేస్తుండగా కాసేపటికే ప్రాణాలు కోల్పోయింది.



## అప్పులపై బహిరంగ చర్చకు మేము సిద్ధం

రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని, బహిరంగ చర్చకు మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సిద్ధమని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఆ చర్చ ఎప్పుడు, ఎక్కడో యనమల చెప్పాలని ఆయన కోరారు. రాజకీయాల్లో తనంత సీనియర్ లేడని, సంపద సృష్టించడం తనకు తెలుసని, అలా సంపద సృష్టించి అన్ని పథకాలు అమలు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబుగారు, అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆ పని చేయకపోగా, 18 నెలల్లోనే రాష్ట్రాన్ని అప్పల కుప్పగా మార్చారని మండిపడ్డారు. భవిష్యత్ తరాలను తాకట్టు పెట్టి అప్ప చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం, ఆ తెస్తున్న డబ్బంతా ఏం చేస్తుందన్న దానికి సమాధానం చెప్పడం లేదని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కారుమూరి వెంకట్‌రెడ్డి ఆక్షేపించారు.




## శంషాబాద్‌లో 13 విమానాలు రద్దు

శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇవాళ (మంగళవారం) మొత్తం 13 విమానాలు రద్దయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. రద్దయిన విమానాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సినవి ఏడు, ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సినవి ఆరు ఉన్నాయి. ఢిల్లీకి వెళ్లాల్సిన ఏడు రద్దయిన విమానాల్లో ఐదు ఇండిగో విమానాలు కాగా.. రెండు ఎయిర్ ఇండియా విమానాలు. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు రావాల్సిన ఆరు రద్దయిన విమానాల్లో ఐదు ఇండిగో విమానాలు, ఒక ఎయిర్ ఇండియా విమానం ఉన్నాయి. కాగా విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎయిర్‌లైన్స్ సిబ్బందిని కోరుతున్నారు.



## భూగర్భ జలాల పెంపునకు

# జలమండలి యాక్షన్ ప్లాన్!

జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు అవసరం.. 300 గజాల పైన ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మాణం చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జలమండలి ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకత ప్రజలకు తెలపడానికి.. జలమండలి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ను రూపొందించిందని చెప్పారు. జిహెచ్ఎంసీ నుండి ఓఆర్ ఆర్ వరకు భూగర్భ జలాలను పెంచే లక్ష్యంగా.. ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ రోజు అధికారులతో కలిసి మాధాపూర్‌లో పర్యటించారు. కాకతీయ హిల్స్ ప్రాంతంలో ఉన్న 15 ఫ్లాట్ల ఓ అపార్ట్‌మెంట్ వాసులు ఇంజక్షన్ బోర్ వెల్ తో నీటి సమస్య లేకుండా చేసిన తీరు ప్రశంసనీయమని ఎండీ అన్నారు. ఈ చర్య జలమండలి లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతో సాధ్యమయ్యే ఉత్తమ నీటి సంరక్షణకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. ఓఆర్ ఆర్ పరిధిలో భూగర్భ జలాలను పెంచే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో జలమండలి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ను రూపొందించిందని చెప్పారు. జలమండలి భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతల కార్యక్రమంలో ప్రతి నివాస సముదాయలు తమ కర్తవ్యంగా భావించి భాగస్వామ్యం అవసరమని అశోక్ రెడ్డి అన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత:నగరంలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదవుతున్నా... పెరుగుతున్న



జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న నివాస, వాణిజ్య సముదాయలతోపాటు ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాలన్నింటిని కాంక్రీట్‌తో కప్పేస్తుండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక భూగర్భ జలాలు అడిగంటిపోతున్నాయి. ఫలితంగా తాగు నీటి కంటే నిత్యావసరాల నీటికోసం ట్యాంకర్ల డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్‌లో ప్రతి ఏటా సగటున 85 నుంచి 89 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదవుతున్నా.. అందులో కేవలం 0. 75 నుంచి 0.95 శాతం మాత్రమే నేలలోకి ఇంకడం మిగితాది వరద రూపంలో మురుగు కాల్వలో కలిసి వృధాగా పోవడం సర్వసాధారణమైంది.గత ఏడాది జలమండలి ఎండీ క్షేత్ర స్థాయిలో పర్యటించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా డిమాండ్‌కు గల వాస్తవ పరిస్థితిపై ఆరా తీశారు. గృహా సముదాయాల్లో ఎండిపోతున్న బోర్లుగా ప్రధాన సమస్యగా గుర్తించారు. పాతాళంలోకి పడిపోతున్న భూగర్భ జలాల పెంపుపై కోసం ప్రత్యేక కార్యాచరణకు దిగారు. తాగు నీటి సరఫరాతో పాటు .. నిత్యావసరాల వినియోగించే నీరు అందుబాటులో ఉండే విధంగా వర్షపునీటి సంరక్షణకు నడుం భిగించారు. అందులో భాగంగా నల్లా కనెక్షన్ క్యాన్ నెంబర్ ఆధారంగా సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా 20 కంటే ఎక్కువ ట్యాంకర్లను బుక్ చేసుకునే ప్రాంగణాలను గుర్తించింది. ఇప్పటికే సుమారు 40 వేల పైగా క్యాన్ నెంబర్లను గుర్తించి 40,209 నివాససముదాయలపై సర్వే నిర్వహించగా, కేవలం 22,825 నివాసాల్లో నే ఇంకుడు గంతలు ఉన్నట్లు,17,384 నివాసాల్లో ఇంకుడు గుంతలు లేనట్లు బహిర్గతమైంది. దీంతో ఇప్పటివరకు16 వేల గృహాలకు నోటీసులు చేసి ఇంకుండు గుంత నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టింది. మరో 25 వేల గృహాలకు వచ్చే మార్చి నాటికీ ఇంకుగుంతలు చేపట్టేలా కార్యాచరణ రూపకల్పన చేసింది. వర్షపు నీటి సంరక్షణలో భాగంగా 300 చదరపు మీటర్ల గల ప్రతి ఇంటా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ప్రాంగణంలో ఇంకుడుగుంత తప్పని సరి చేస్తూ జలమండలి చర్యలు చేపట్టింది. పాత, కొత్త నివాస, వాణిజ్య సముదాయాలపై దృష్టి సారించింది. భూగర్భ జలాల పెంపు కోసం ప్రజా స్థలాలో ఇంకుడు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రజా స్థలాలు,కాలనీలు,ప్రభుత్వ సముదాయాలు, విద్యా సంస్థలు,రోడ్డు పక్కన గల నివాస, వాణిజ్యసముదాయల రూఫ్ టాప్ నుండి కిందికి పడే వర్షపు నీటిని పైపుల ద్వారా సంరక్షణ కోసం ప్రజా ఇంకుడు గుంతల ఏర్పాటుకు సిద్ధమైంది. అలాగే నిరుపయోగంలో ఉన్న బోరు బావులను హార్వెస్టింగ్ పిట్‌లతో ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చాలని నిర్ణయించింది. వీటితోపాటు ఓఆర్ ఆర్ పరిధిలోని గెటెడ్ కమ్యూనిటీలు, బహు అంతస్తుల భవన సముదాయాల్లో కమ్యూనిటీ ఇంకుడు గంత ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక అవగాహన కార్యాక్రమాలు ఏర్పాటు చేయనుంది. ఓఆర్‌ఆర్ లోపల, అవతల గెటెడ్ కమ్యూనిటీలు, బహుళ అపార్ట్ మెంట్లను గుర్తించారు. అయా నివాస సముదాయలకు ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకతలపై అవగాహన కల్పిస్తారు.



### శివ రాజ్‌కుమార్ – ఉపేంద్రల

## మెగా మల్టీస్టారర్.. ’45’ ట్రైలర్ విడుదల

కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం ’45’ (45). ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ (VFX) కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం డిసెంబరు 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.



### రాహుల్ వ్యాఖ్యలపై

## కిషన్ రెడ్డి ఫైర్

ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు అనైతికమని, ప్రధాని స్థాయిని తగ్గించే విధంగా ఉన్నాయన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండటం దేశానికి దురదృష్టకరమని కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలతో ప్రధాని సమావేశం మర్యాదపూర్వకమైనదని, పార్టీని బలోపేతం చేయాలని, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని ప్రధాని సూచించారని తెలిపారు. సమావేశ వివరాలు లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



### సుజిత్‌కి లగ్జరీ కారు బహుమతిగా ఇచ్చిన

## పవన్ కళ్యాణ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు చాలా రోజుల తర్వాత బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత పవన్‌కి ఓజీ రూపంలో బ్లాక్ బస్టర్ రావడంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే ‘ఓజీ’ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం.. నటుడు పవన్ కళ్యాణ్ చిత్ర దర్శకుడు సుజిత్ కు అద్భుతమైన బహుమతిని అందించారు. ‘ఓజీ’ సాధించిన అద్భుత విజయానికి సంతోషించిన పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజిత్‌కు లగ్జరీ కారుని బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ కార్ల కంపెనీ లాండ్ రోవర్‌కి చెందిన రేంజ్ రోవర్ లగ్జరీ కారుని సుజిత్‌కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కాగా ఈ విషయాన్ని సుజిత్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు.

## మరోసారి ఐటెమ్ గర్ల్‌గా

పూజా హెగ్డే ఇటీవల వరుస ఫ్లాప్‌లతో హీరోయిన్‌గా అవకాశాలు తగ్గినా, స్పెషల్ సాంగ్స్‌తో మళ్లీ క్రేజ్ పెంచుకుంటోంది. రజనీకాంత్ ‘కూలీ’లోని ‘మౌనిక’ పాట విజయంతో ఆమెకు కొత్త ఆఫర్లు వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం అల్లు అర్జున్–అట్లీ కాంబోలో తెరకెక్కుతున్న భారీ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌కు పూజాను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఆమెకు సుమారు ₹5 కోట్లు పారితోషికం ఇస్తున్నారని టాక్. ఇదిలా ఉండగా, ఆమె షేర్ చేసిన తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పూజా మరోసారి గ్లామర్‌తో, స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది.తన కెరీర్ పీక్‌లో ఉన్నప్పటికీ, కొన్ని కీలక సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడకపోవడం పూజా కెరీర్‌కు అడ్డంకిగా మారింది. అయితే ఆమె స్టార్ ఇమేజ్ మాత్రం తగ్గలేదు.



### ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

## సత్తుపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన



సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నాడు ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను సోమవారం నాడు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ స్వయంగా పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఘట్టం సామగ్రి పంపిణీ కావడంతో, ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. పంపిణీ కేంద్రం వద్ద రద్దీని నివారించడానికి మరియు ప్రక్రియ సజావుగా సాగడానికి అవసరమైన అన్ని చర్యలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు, సిబ్బందికి సామగ్రి తీసుకునే సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మంచినీటి సౌకర్యం, నీడ మరియు క్యూ లైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సామగ్రిని తీసుకున్న వెంటనే, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు నిర్ణీత సమయంలోగా సురక్షితంగా చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రవాణా విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, ప్రతి పోలింగ్ కేంద్రానికి సామగ్రి సకాలంలో చేరడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన అనంతరం, అదనపు కలెక్టర్ శ్రీజ పీఆర్ డివిజన్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని, బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో రాజీ పడకూడదని ఆమె అధికారులకు సూచించారు. అక్కడి రికార్డులను మరియు వసతులను పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, ఇతర శాఖల సమన్వయంపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది బాధ్యతయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆమె కోరారు. మంగళవారం జరగనున్న ఈ పంపిణీ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఆదేశిస్తూ తన పర్యటనను ముగించారు.

### 400 కోట్ల క్లబ్‌లో

## ధురంధర్

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగిస్తూ, చరిత్ర సృష్టిస్తోంది. ఈ సినిమా వసూళ్లు అంచనాలకు మించి దూసుకుపోతున్నాయి. వీక్ డేస్ వసూళ్లు తగ్గే రోజుల్లో కూడా ‘ధురంధర్’ సంచలన సంఖ్యలను నమోదు చేస్తూ దేశంలోని అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలుస్తోంది. సాధారణంగా రెండవ సోమవారం గణనీయమైన వసూళ్ల తగ్గుదల ఉంటుంది. కానీ, ‘ధురంధర్’ రెండవ సోమవారం కూడా రూ. 31.80 కోట్లు వసూలు చేసి, మునుపెన్నడూ లేని రికార్డును నెలకొల్పింది. తాజాగా ఈ చిత్రం 11 రోజుల్లో రూ.396 కోట్లు వసూళ్లను రాబట్టి రూ.400 కోట్ల దిశగా దూసుకెళుతుంది. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో సారా అర్జున్ కథానాయికగా నటించగా.. అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, మాధవన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి ఉరి దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించాడు.

